
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం: 30.0 | కనిష్ఠం: 22.0

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

శుక్రవారం 12 సెప్టెంబరు 2025

రోజా పడిగాపులు ● యూరియా కోసం రైతుల అవస్థలు 6



'పేట' క్రీడా మైదానంలో టోకెన్ల కోసం వర్షంలో బారులు తీరిన రైతులు


తప్పుల కుప్పలు

- వివాహమై వేరే ఊర్లో ఓటు ఉన్నా తొలగించని అధికారులు
- ఒకే వ్యక్తికి ఇంటి పేరు, నంబర్ మార్చి డబుల్ ఓట్ల కేటాయింపు
- తెలుగు వర్ణమాలలోని అక్షరాలకు కూడా ఓటు హక్కు
- బీఎల్ఓల స్థాయిలోనే తొలగించాల్సి ఉండగా.. ఆ ప్రక్రియ శూన్యం
- మునిసిపాలిటీల్లో స్థిరపడిన వారు గ్రామాల్లోనూ ఓటు వినియోగం

ఓటరు జాబితాల్లో చనిపోయిన, వలస వెళ్లిన వారి పేర్లు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏదైనా పథకంలో ఒక చోట లబ్ధి పొందుతున్నామంటే.. మరోచోట ఆ పేరును లబ్ధిదారుల జాబితాలో నుంచి తీసివేస్తారు. ఇటీవల జరిగిన నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియలోనూ ప్రభుత్వం ఈ నిబంధనను పాటించింది. తల్లిదండ్రుల కార్డుల్లో ఉన్న పేర్లను తొలగించుకుంటేనే.. కొత్త జంటలకు ప్రత్యేకంగా కార్డు జారీ చేసింది. ఆధార్ కార్డు ఒకచోట తీసుకుంటే మరో చోట తీసుకోవడానికి అవకాశం లేదు. ఒకవేళ వేరేచోట స్థిరపడితే అదే కార్డులో అడ్రస్సు మార్చుకోవాల్సిందే.. ఒకవేళ చనిపోయినా, వేరేచోట స్థిరపడినా, ఆ పేరును వెంటనే పథకాల లబ్ధిదారుల జాబితాలో నుంచి తీసివేస్తారు. ఇది సాధారణంగా జరగాల్సిన ప్రక్రియనే.. కానీ తమకు సేవ చేసే ప్రజాప్రతినిదులను ఎన్నుకునే ఓటు హక్కు విషయంలో మాత్రం అధికారులు ఎలాంటి నిబంధనలు పాటించలేదు. ఒక్కో వ్యక్తి మూడు నుంచి నాలుగుచోట్ల ఓటు హక్కును కల్పిస్తున్నారు. ఆధార్‌తో అనుసంధానం ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ.. ఇంకా డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, వివాహం అయిన వారి ఓట్లు, వేరేచోట్ల స్థిరపడిన వారి ఓట్లు మాత్రం తొలగించడం లేదు. దానికి తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల వద్ద ప్రచురించిన ఫొటో రోల్ ఓటర్ జాబితానే

(మిగతా 6లో..)




3143	ఎ.సి.-పి.ఎస్ - వరుస సంఖ్య : 77 - 274 - 347
ఓటరు పేరు	:శేఖర్
తండ్రి పేరు	:పెద్ద అయ్యన్న
వయస్సు	:38 లింగము :M
ఇంటి నెంబర్.	:1-68
ఎపిక్ నెంబర్	CYV4310785

నారాయణపేట జిల్లా నర్వలో 15 ఏళ్ల క్రితం చనిపోయిన శేఖర్ అనే వ్యక్తికి ఉన్న ఓటు హక్కు



నారాయణపేట జిల్లా ధన్వాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ తుది ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న పంచాయతీ అధికారులు



1374	ఎ.సి.-పి.ఎస్ - వరుస సంఖ్య : 76 - 79 - 773
ఓటరు పేరు	:అ
తండ్రి పేరు	:శ
వయస్సు	:25 లింగము :F
ఇంటి నెంబర్.	:5-63/2
ఎపిక్	IXR2163582
ముద్రణ తేదీ :28-08-2025	తేదీ నాటికి వయసు: 01

మహబూబ్‌నగర్ జిల్లా పోల్కంపల్లిలో ఒక మహిళ పేరు 'అ' అని, తండ్రి పేరు 'శ' అని తప్పుగా వచ్చిన పేర్లు

రూ.20 లక్షల పరిహారానికి సీఎం గ్రీన్ సిగ్నల్?

- పేట-కొడంగల్ భూ నిర్వాసితులకు ఇచ్చేందుకు అంగీకారం

నారాయణపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదివరకు ఇస్తున్న రూ.14 లక్షల పరిహారం చాలదని, రూ.20 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు ఆందోళనలు చేపడుతున్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎంతో జరిపిన చర్చలు ఫలించాయని, ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దాంతో శుక్రవారం నుంచి రైతుల వద్దకు వెళ్లి సమ్మతి పత్రాలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధమైంది. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. న్యాయమైన పరిహారం చెల్లించాలని నిర్వాసితులు పేట మునిసిపల్ పార్కు దగ్గర చేపట్టిన రిలే దీక్షలు 59వ రోజుకు, దామరగిద్ద మండలం కానుకుర్తిలో 36వ రోజుకు చేరుకున్నాయి.

వారి త్యాగాలు మరువలేనివి

- అటవీ అమరవీరుల దినోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి
- అమరుల స్థూపం వద్ద నివాళులు



అటవీ అమర వీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వాటిని రక్షించే క్రమంలో ఎంతో మంది అధికారులు, సిబ్బంది ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని, వారి త్యాగాలు మరువలేనివని చెప్పారు. గురువారం అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం ఆవరణలోని అటవీ అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అటవీశాఖ అధికారి సత్యనారాయణ, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ పుష్పగుచ్ఛాలతో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులను కాపాడే క్రమంలో సంఘ వ్యతిరేకుల చేతిలో ఎంతోమంది అసువులు బాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సేవలను కొనియాడారు. అడవులను కాపాడుకుంటేనే వర్షాలు కురుస్తాయని, రైతులు బాగుంటారని, ప్రజలకు ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ఈ క్రమంలోనే టూరిజం కూడా అభివృద్ధి చెందుతుందని గుర్తు చేశారు. ఇకో టూరిజం పై ప్రచారం కల్పించడంలో మీ పాత్ర ఎనలేదని కొనియాడారు. జిల్లాలో విస్తారమైన అడవులు ఉన్నాయని, ఏటా వన మహోత్సవం కార్యక్రమం ద్వారా అధిక సంఖ్యలో మొక్కలు పెంచుతున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉన్నదని తెలిపారు. అనంతరం సిబ్బంది ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌ఓ గణేష్, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ఎందుకు పాటించడం లేదు?

- గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌పై కలెక్టర్ ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలోని నాగసాల సమీపంలో గల తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించకపోడంపై కలెక్టర్ విజయేందిర బోయి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ గురువారం పాఠశాలను తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. మెనూ పరిశీలించి, ఆ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదని ప్రిన్సిపాల్ పారిజాత, ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని చెప్పారు. వంట చేసే సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపైనే దృష్టిపెట్టాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు.

యూరియా విక్రయాల తనిఖీ

జడ్చర్ల పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలలో యూరియా సరఫరా చేస్తున్న తీరును కలెక్టర్ విజయేందిరబోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాదేపల్లి గంజ్‌కు సమీపంలోని కొన్ని ఫర్టిలైజర్స్ దుకాణాలలో యూరియా స్టాకు వివరాలు, రైతులకు విక్రయిస్తున్న తీరు, రైతులు పేర్లు నమోదు చేసుకుంటున్న వివరాలను పరిశీలించారు. యూరియా సరఫరా గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్క్‌ఫెడ్ గోదాములోని బఫర్ స్టాకును తనిఖీ చేశారు.

తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్లు 7

అంతర్రాష్ట్ర పశువుల దొంగల అరెస్టు

- కన్నన్‌కాల్వ శివారులో తనిఖీల్లో పట్టుబడ్డ నిందితులు
- 9 రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

7

దసరాలోపు.. పనులు పూర్తి చేయాలి

- హ్యాండ్లూమ్ ఎక్సలెన్స్‌ను పరిశీలించిన నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దసరా పండుగలోపు హ్యాండ్లూమ్ ఎక్సలెన్స్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నారాయణపేటలోని సెంటర్ ఆఫ్ హ్యాండ్లూమ్ ఎక్సలెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీజీ ఎంఎస్ ఐడీసీ ఈఈ రతన్ కుమార్, ఓఎస్డీ టెస్కో, హైదరాబాద్ శ్రీలత, టెస్కో హైదరాబాద్ విద్యుత్ శాఖ అధికారి బాబు, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు పాల్గొన్నారు.



హ్యాండ్లూమ్ ఎక్సలెన్స్‌ను పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

తెలివైన చిరుత

- పాలమూరు టీడీ గుట్ట అటవీ ప్రాంతం నుంచి బయటకు రాని మృగం
- బోనులోని మేక అరిచినా అటువైపు వెళ్లని లియోపార్డ్
- ఆహారం దొరుకుతున్నందునే బోన్ వైపు రావడంలేదంటున్న అధికారులు



టీడీగుట్ట అటవీ ప్రాంతంలో బండరాయిపై పడుకున్న చిరుత

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ నగరంలోని టీడీ గుట్ట ప్రాంతంలో మూడు నెలలుగా సంచరిస్తున్న చిరుత చిక్కడం లేదు. పదిహేను రోజులకోసారి దర్శనమిస్తుండటంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత ఉన్న ప్రాంతం చుట్టూ రహదారులు ఉండటంతో బయటకు వెళ్ళలేక అక్కడే అటూ ఇటూ తిరుగుతోంది. చిరుతను బంధించడానికి అటవీశాఖ 4 ప్రాంతాలలో బోన్లు ఏర్పాటు చేసి, 10 సీసీ కెమెరాలతో కదలికలను పర్యవేక్షిస్తున్నారు. బోన్లలో రాత్రివేళ మేకలను ఉంచినా వాటి అరుపులకు కూడా చిరుత అటువైపు కన్నెత్తి చూడటం లేదంటే అది చాలా తెలివైనదిగా అధికారులు భావిస్తున్నారు. చిరుత బుధవారం సాయంత్రం పెద్ద బండరాయిపైకి వచ్చి కూర్చోవడంతో స్థానికులు భయపడ్డారు. అయితే చిరుత అడవిలో అటూ ఇటూ తిరుగుతుందే తప్ప.. ఇప్పటివరకు జనావాసాల్లోకి రాలేదు. జీవాలను సైతం తినలేదు. అడవిలో చిరుతకు ఆహారం లభిస్తుండటంతో జనావాసాల్లోకి రావడం లేదని అధికారులు భావిస్తున్నారు. సీసీ కెమెరాల్లో మాత్రం డంపింగ్ యార్డ్‌వైపు వెళుతున్నట్లు పలుమార్లు కనిపించడంతో అక్కడ ఆహారం లభిస్తుందన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. చిరుత బోనులో చిక్కితే తప్ప చేయగలిగిందేమీ లేదని యంత్రాంగం ఎదురుచూస్తోంది.

కారు, ఆటో ఢీ, పలువురికి గాయాలు



గాయపడిన వ్యక్తులు

తెలకపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూలీలను, విద్యార్థులను తరలిస్తున్న ప్యాసింజర్ ఆటో, కారు ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని గోలగుండం శివారులో గురువారం జరిగింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాల మండలం రాంపూర్ నుంచి ప్యాసింజర్ ఆటో కూలీలతో పాటు విద్యార్థులను ఎక్కించుకుని తెలకపల్లి వైపు వస్తోంది. గోలగుండం శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఆటో పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో దాదాపు 10 మంది విద్యార్థులు, కూలీలు గాయపడ్డారు. వారిలో విద్యార్థిని, కూలీ చిన్నమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మాగనూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మాగనూరు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, మాగనూరుకు చెందిన కురువ సాలె మనోజ్‌కు, కురువ గౌరమ్మ (21)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. గత ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన గౌరమ్మ ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకున్నది. గమనించిన మామ బసవరాజు వెంటనే ఆమెను కిందికి దించి గౌరమ్మ అన్నలకు ఫోన్ చేశాడు. వారొచ్చి గౌరమ్మను మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, గౌరమ్మకు మెదడు సంబంధిత వ్యాధి ఉన్నదని, మహబూబ్‌నగర్ ఆసుపత్రికే తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో వారు ఆమెను మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఆమె అన్న మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరితాడైన పలుపుతాడు

▸ మెడకు బిగుసుకొని పాడి ఆవు మృతి



మృతి చెందిన పాడి ఆవు

చారకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పలుపుతాడే ఉరితాడై పాడి ఆవును బలి తీసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని గోకారంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కమోజీ ఆంజనేయులు అనే రైతుకు చెందిన పాడి ఆవు గురువారం పొలంలో మేస్తుండగా పలుపుతాడు మెడకు బిగుసుకుపోయి అక్కడికక్కడే చనిపోయింది. దాని విలువ రూ.90 వేలు ఉంటుందని ఆంజనేయులు తెలిపారు.

విద్యుదాఘాతంతో 2 గొర్రెలు మృతి



పగిడ్యాల్‌లో విద్యుత్తు షాక్‌తో చనిపోయిన గొర్రెలు

గండీడ్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు చనిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండలంలోని పగిడ్యాల్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్ గ్రామానికి చెందిన గొల్ల చిన్న మల్లప్ప గురువారం తన గొర్రెలను పగిడ్యాల గ్రామంలో మేపుతున్నాడు. అవి మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో విద్యుత్ తీగలు తగిలి రెండు గొర్రెలు మృతి చెందాయి. మరో రెండు గాయపడ్డాయి. వాటి విలువ రూ. 30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

▸ 10 మందిపై కేసు నమోదు

రాజోలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. రాజోలి ఎస్‌ఐ గోకారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ రమేష్ అనే వ్యక్తికి చెందిన గుడిసెలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం రాత్రి దాడులు చేశారు. అక్కడ పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. పేక ముక్కలు, రూ. 11,320 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంది పంట ధ్వంసం

▸ వ్యక్తిపై కేసు నమోదు

ఉండవల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కంది పంటను ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని బైరాబారం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అన్నాదమ్ములు కురువ రాముడు, కురువ శ్రీనివాసులు, కురువ వెంకటేశ్వర్లు కలిసి గ్రామ శివారులో కృష్ణారెడ్డికి చెందిన 4 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ముగ్గురూ మూడు భాగాలుగా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమిని కౌలుకు ఇచ్చి, వచ్చే ఆదాయాన్ని కురువ రాముడు ఒక్కడే తీసుకుంటున్నాడు.

ఈ విషయంపై అన్నాదమ్ముల మధ్య వివాదం నెలకొన్నది. కురువ వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం తన వాటా పొలంలో కంది పంట వేసుకున్నాడు. ఈ నెల 8న కురువ రాముడు పొలంలోకి ప్రవేశించి గుర్తుతెలియని మందు పిచికారి చేయడంతో పూర్తిగా ధ్వంసం అయ్యింది. సంఘటనపై బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


తప్పుల కుప్పలు

(5వ పేజీ తరువాయి)

ఉదాహరణగా చెప్పవచ్చు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు అందరికీ జరుగుతాయి కాబట్టి డబుల్ ఓటు ఉన్నవారు వాటిని వినియోగించుకునే అవకాశాలు చాలా తక్కువ.. కానీ పంచాయతీలు, మునిసిపాలిటీలకు జరిగే ఎన్నికలు ఒకేసారి జరిగే అవకాశం లేకపోవడంతో చాలామంది అటు పంచాయతీల్లో.. ఇటు మునిసిపాలిటీల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. బీఎల్‌ఓ స్థాయిలోనే ఈ తొలగింపు ప్రక్రియ జరగాల్సి ఉండగా.. ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఓటర్ జాబితా తప్పుల తడకగానే మారిందని చెప్పొచ్చు. ప్రస్తుతం ప్రచురించిన ఓటర్ల జాబితా ప్రతీ గ్రామంలో అధికారుల అలసత్వాన్ని ఎత్తిచూపుతోంది.


మచ్చుకు కొన్ని..

పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓటర్ జాబితా విషయంలో చాలా తప్పులు జరుగుతున్నాయని ఇటీవల ఆరోపించారు. అక్షరాలకు కూడా ఓటు హక్కును కల్పిస్తున్నారని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అది కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గానికి సంబంధించినవి. స్థానికంగానూ తప్పులు జరుగుతున్నాయి. ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం పొల్కంపల్లిలో ఒక మహిళ ఫొటో పెట్టి ఆమె పేరు 'అ' , ఆమె తండ్రి పేరు 'శ' అని



3882 ఎ.సి-పి.ఎస్-వ సంఖ్య -85-19-504
ఓటరు పేరు : బుశమ్మా
భర్త పేరు : నాగమల్లైయ
వయస్సు : 34, లింగం: స్త్రీ
ఇంటి నం. 4-25
ఓటరు సంఖ్య RFQ0840843

నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లిలో బూషమ్మ అనే మహిళ స్థానంలో కృష్ణయ్య ఫొటో



1340 ఎ.సి.-పి.ఎస్ - వరుస సంఖ్య. : 79 - 119 - 807
ఓటరు పేరు :అనొక్కూ
తండ్రి పేరు :మునప్ప
వయస్సు :19 లింగము :M
ఇంటి నెంబర్. :3-12
ఎపిక్ XYX2650851

గద్వాల జిల్లా గట్టు మండలం చాగదోనలో అశోక్ బదులు అనొక్కూగా పేరు తప్పుగా ప్రింట్

ముద్రించి ఓటుహక్కు కల్పించారు. ఇదే గ్రామంలో ఇంటినెంబర్ లేకున్నా.. జామే మసీదు అని పెట్టి ఓటు ఇచ్చారు. అలాగే కొన్నిచోట్ల ఇంటి పేరు పూర్తిగా ఉండి ఒక ఓటు.. కేవలం ఇన్షియల్‌తో మరో ఓటు కల్పించారు. కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో రోజ అనే మహిళకు రెండు ఓట్లు వచ్చాయి. మాఎస్‌డీఏపురం రోజా భర్త పేరు ఏ కిరణ్‌కుమార్ అని ఒకసారి, ఎం.రోజ, భర్త అకునమోని కిరణ్‌కుమార్ అని మరోసారి ఓటు వచ్చింది. ఇంటి నెంబర్లను తర్జుమా చేసి కూడా కొన్ని ఓట్లు వచ్చాయి. నారాయణపేట మండలంలోని బోయిన్‌పల్లిలో సూర్య అనే వ్యక్తికి తల్లి యంకమ్మ పేరుతో 7-10 ఇంటి నెంబర్‌తో ఒకసారి, తండ్రి నర్సింహులు పేరుతో 170 ఇంటి నెంబర్‌తో మరోసారి రెండుసార్లు ఓటు హక్కు కల్పించారు. ఒకరి ఫొటోకు బదులు మరొకరి ఫొటోలు ప్రింట్ అయిన ఘటనలు కూడా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో భూషమ్మ భర్త నాగమలయ్య పేరుతో వచ్చిన ఐడీలో వాస్పరి కృష్ణయ్య అనే వ్యక్తి ఫొటో ప్రింట్ అయ్యింది. ఇలా చెప్పుకుంటూపోతే అన్ని గ్రామాల్లోని ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉంది.

అధికంగా డబుల్, డెత్ ఓట్లు..

ఒక వ్యక్తి చనిపోయిన వెంటనే ఆ గ్రామంలోని జనన/మరణ రిజిస్టర్లలో పొందుపరిచి.. డెత్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. గతంలో ఈ ప్రక్రియ సరిగా లేకున్నా.. ఇప్పుడు బీమా కోసం అందరూ డెత్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. అదే సమయంలో బీఎల్‌ఓలు అదే గ్రామానికి చెందిన వారు ఉంటారు కాబట్టి.. ఆ వ్యక్తులు చనిపోయిన విషయం వారికి తెలుస్తుంది. కానీ చనిపోయిన ఓటర్లను చాలా చోట్ల తొలగించడం లేదు. అలాగే వివాహం అయ్యి వెళ్లిపోయినా, వేరేచోట్ల స్థిరపడిన వారి వివరాలను కూడా తొలగించడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉమ్మాపూర్ ఓటర్ జాబితాలో 9 మంది చనిపోయిన వారికి ఓట్లు కల్పించారు. ఇదే జిల్లా ఉర్కొండపేట గ్రామంలోని జాబితాలో 12 మంది చనిపోయిన వారి పేర్లు, 18 మంది వివాహం అయి వెళ్లిపోయిన వారి పేర్లు, 46 మంది వేరే ప్రాంతానికి వలస వెళ్లి స్థిరపడిన వారి పేర్లు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం పోతులమడుగు పంచాయతీ పరిధిలో 20 మంది చనిపోయిన వారి పేర్లు, డబుల్ పేర్లు 15 వరకు నమోదయ్యాయి. అచ్చంపేట మండలం లింగోటం పంచాయతీ పరిధిలో 1,449 ఓట్లు ఉండగా.. 10 మంది చనిపోయిన వారి ఓట్లు కూడా జాబితాలో వచ్చాయి. కల్వకుర్తి మండలం మార్చాలలో పోలింగ్ బూత్ నెంబర్ 55లో 837 ఓట్లు ఉండగా.. డబుల్ పేర్లు 20 మందివి, చనిపోయిన వారి పేర్లు 10 మందివి నమోదయ్యాయి. ఇదే గ్రామంలోని 53వ పోలింగ్ బూత్‌లో 1,231 ఓట్లు ఉండగా.. 30 మంది డబుల్ ఓట్లు, 24 మంది చనిపోయిన వారి ఓట్లు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో శేఖర్ అనే వ్యక్తి చనిపోయి 15 ఏళ్లయినా ఓటర్ జాబితాలో పేరు తొలగించలేదు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం రుసుంపల్లిలో 1,200 ఓట్లు ఉండగా.. 46 మంది చనిపోయిన వారి పేర్లు జాబితాలో వచ్చాయి. ఈ గ్రామంలో కొనింటి సత్యమ్మ అనే మహిళ చనిపోయి పది సంవత్సరాలైన ఇంకా ఓటర్ లిస్టులో కొనసాగుతూనే ఉంది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

▸ పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్



బాలికల హస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్ బాబుతో కలిసి గురువారం ఆయన యూనివర్సిటీలోని బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు మెను ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ రోజు రాగిజావ తాగాలని, పండ్లు, గుడ్లు తినాలని విద్యార్థినులకు సూచించారు. నాణ్యమైన వంట సరుకులు అందించాలని చీఫ్ వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీని పరిశీలించారు. ఇంజనీరింగ్, లా కోర్సులకు సంబంధించిన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పీజీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, చీఫ్ వార్డెన్ కృష్ణయ్య, అధికారులు, తదితరులు ఉన్నారు.

జైలు శిక్షకు బదులుగా సమాజసేవ

▸ తీర్పు ఇచ్చిన న్యాయాధికారి

గద్వాల క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన మద్యం తాగుతూ పోలీసులకు పట్టుబడిన ఓ వ్యక్తికి జైలు శిక్షకు బదులు, సమాజ సేవ చేయాలని న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా కోర్టులో గురువారం భారత న్యాయ సురక్షా స్మృతి (బీఎన్ఎస్ఎస్) మేరకు ఇచ్చిన తొలి తీర్పు ఇది. కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాలకు చెందిన ఈరన్న అనే వ్యక్తి ఇటీవల రోడ్డు పక్కన మద్యం తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అతడిని గురువారం జిల్లా కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా అతడికి చట్టంలోని 355వ సెక్షన్ ప్రకారం సమాజ సేవ చేయాలంటూ మొదటి అదనపు ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి ఉదయ్‌నాయక్ తీర్పు వెల్లడించారు. 'మద్యం మత్తులో వాహనం నడపవద్దు' అని రాసి ఉన్న ప్లకార్డు పట్టుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు నిలబడాలని ఆదేశించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారికి హెచ్చరికగా న్యాయాధికారి తీర్పు ఇచ్చారని కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

▸ గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన ఫ్రిడ్జ్

పెబ్బేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీలోని విద్యానగర్ కాలనీలోని ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన తిరుపతయ్య విద్యుత్ సరఫరా సమయంలో వాటర్ హీటర్‌ను ఆన్ చేసి పనిమీద ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. కరెంట్ రాగానే షార్ట్ సర్క్యూట్‌తో తీగలకు మంటలు అంటుకొని దట్టమైన పొగలు వచ్చాయి. గమనించిన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. తలుపులు పగులకొట్టి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంట్లోని ఫ్రిడ్జ్‌తో పాటు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారి మధు సూచించారు.

దుందుభీ వాగులో చిక్కుకున్న కూలీలు

అచ్చంపేట రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలంలోని మన్నెవారిపల్లి గ్రామ సమీపంలో ఉధృతంగా పారుతున్న దుందుభీ నదిలో కూలీలు చిక్కుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా, దేవరకొండ మండలంలోని పోలేపల్లి బండతండాకు చెందిన సెంట్రింగ్ కూలీలు ఆరుగురు గణపురం ఆంజనేయ తండాలో పనికి వచ్చారు. పని ముగిసిన తర్వాత రాత్రి 7:30 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో దుందుభీ వాగు దాటుతూ మధ్యలో చిక్కుకుపోయారు. స్థానికుల సమాచారం మేరకు సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ స్పందించి సిబ్బందిని అక్కడికి పంపించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులతో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో కూలీలను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని యువకుడు ఎండీ బురాన్ (20) ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌లోని సాదత్ స్ట్రీట్‌కు చెందిన బురాన్ కుటుంబ కలహాలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం రాత్రి పైపునకు ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

రోబోటిక్స్ టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్

▸ సోహం అకాడమీ ప్రతినిధి అరవింద్



సదస్సులో రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అరవింద్

ధరూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోబోటిక్స్ టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సోహం అకాడమీ ప్రతినిధి అరవింద్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి అరవింద్ మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్, ఏఐ, రోబోటిక్స్ తదితర సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన సాగుతోందన్నారు. విద్యార్థులకు ప్రాథమికక స్థాయి నుంచే రోబోటిక్స్ తరహా సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్పించాలని సూచించారు. దీంతో వారు శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని చెప్పారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్, రాధారాణి, లక్ష్మీకాంతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



పేట క్రీడా మైదానంలో టోకన్ల కోసం వర్షంలో బారులు తీరిన రైతులు



భూత్పూర్ మన గ్రోమోర్ షాపు వద్ద క్యూలైన్ కట్టిన రైతులు



నర్వలో మన గ్రోమోర్‌లో యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

ప్రతీ రోజు పడిగాపులు

▸ యూరియా కోసం రైతుల అవస్థలు
▸ వర్షంలో తడుస్తూనే ఎదురుచూపులు
▸ నారాయణపేట, భూత్పూర్‌లలో రాస్తారోకో
▸ కోడేరు సింగిల్ విండో గోదాం వద్ద ధర్నా



భూత్పూర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న రైతులు

నారాయణపేట/ నర్వ/ భూత్పూర్/ దేవరకద్ర/ మిడ్జిల్/ కోడేరు/ తాడూరు/ ఆత్మకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం పడుతున్నా పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్ దుకాణాల ముందు ఎదురు చూడక తప్పడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గురువారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది.

● ప్రతీ ఒక్కరికీ యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయం ముందున్న అంతర్రాష్ట్ర రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. దీంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రైతులకు నచ్చచెప్పి కొందరిని సింగిల్ విండో కార్యాలయం వద్దకు, మరికొందరిని ఎదురుగా క్రీడా మైదానంలోకి పంపించారు. వర్షంలోనే తడుస్తూ రైతులు క్యూలైన్లలో నిలుచున్నారు. వరుస క్రమంలో వారందరికీ టోకెన్లు అందించారు. ఆ తర్వాత లారీల్లో 600 బస్తాలు యూరియా రావడంతో ఒక్కో రైతుకు బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయించారు. మిగిలిన 570 మంది రైతులకు టోకన్లు వచ్చారు. శుక్రవారం యూరియా వచ్చిన వెంటనే సరఫరా చేస్తామని నచ్చచెప్పి పంపించేశారు.

● నారాయణపేట మండలంలోని కోటకొండ రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. 300 బస్తాల యూరియా రావడంతో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. మిగిలిన 65 మంది రైతులకు టోకెన్లు ఇచ్చి పంపించారు.

● నర్వ మండల కేంద్రంలోని మన గ్రోమోర్, పీఏసీఎస్‌ల వద్ద పోలీస్ పహారా మధ్య 150 మంది రైతులకు ఒక్కొక్కరికి 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. మిగిలిన 150 మందికి శుక్రవారం పంపిణీ చేస్తామని చెప్పి టోకెన్లు రాసి ఇచ్చారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణం ముందు రైతులు బారులు తీరారు. కానీ సాయంత్రం వరకు యూరియా లారీలు రాకపోవడంతో ఆందోళనకు దిగారు. దాదాపు 1000 మంది రైతులు భూత్పూర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు నచ్చచెప్పినా వినకుండా దాదాపు 2 గంటల పాటు ఆందోళన కొనసాగించారు. చివరకు అందుబాటులో ఉన్న 360 సంచుల యూరియాను రైతులకు అందించారు. మిగిలిన వారికి శుక్రవారం ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

● దేవరకద్ర సహకార సంఘం కార్యాలయం వద్దకు దాదాపు 600 మంది రైతులు వచ్చారు. ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

● మిడ్జిల్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ రైతు సేవా కేంద్రం ముందు ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. టోకెన్లు తీసుకున్న రైతులకు సాయంత్రం పొద్దుపోయే వరకు యూరియా పంపిణీ చేశారు.

● మహమ్మదాబాద్‌లోని నంచర్ల గేటు వద్దనున్న రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ఐదారు గంటల పాటు క్యూలైన్లలో ఎదురు చూశారు. అయినా చాలా మందికి యూరియా దొరకక పోవడంతో వెనుదిరిగారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల కేంద్రంలోని సింగిల్ విండో గోదాం వద్ద రైతులు ధర్నా చేశారు. వారికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు మద్దతు తెలిపారు. రైతులకు సరిపడా యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మాచినేనిపల్లి రాములు, మల్లయ్య, స్వామినాయక్, బాలస్వామి, రాజేశ్, మాసయ్య పాల్గొన్నారు.

● తాడూరు మండలంలోని ఐతోల్‌లో ఆగ్రో రైతు సేవ కేంద్రం వద్దకు 500 మందికి పైగా రైతులు చేరుకున్నారు. ఆక లారీలో 300 బస్తాల యూరియా రావడంతో ఏఈవో సందీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 150 మంది రైతులకు పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు టోకెన్లు ఇచ్చారు.

● వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో వారికి యూరియా పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

బల్మూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో జరిగినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. మండలంలోని ఇప్పకుంట గ్రామానికి చెందిన సలేశ్వరం(32) 15 సంవత్సరాల నుంచి 8 ఎకరాల భూమిని లీజుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. బుధవారం రాత్రి పొలానికి నీరు పెట్టడం కోసం వెళ్లి రాత్రి పొద్దుపోయే వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య రేణమ్మ పొలంలోనే భర్త నిద్రపోయి ఉంటాడని అనుకొని ఉదయం పొలానికి వెళ్లి వెతకగా, సలేశ్వరం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తుతో మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి


మిట్టె చెన్నయ్య (ఫైల్)

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బెల్ట్ షాపులో మద్యం తాగి, మద్యం మత్తులో మురుగుకాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారులో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతబజారులోనీ ఎస్సీ కాలనీకి చెందిన మిట్టె చెన్నయ్య(49) ప్రతీరోజు మాదిరిగానే గురువారం ఉదయం సమీపంలోని బెల్ట్‌షాపులో మద్యం కొనుగోలు చేసి తాగాడు. అనంతరం బెల్ట్‌షాపు సమీపంలోని మురుగు కాలువలో ప్రమాదవశాత్తు పడ్డాడు. తీవ్రంగా గాయపడిన చెన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. మృతుడి భార్య ఇటీవల మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో పాతబజారు ప్రాంతంలో ఉన్న ఐదు బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. సీఐ విప్లవ్‌రెడ్డి, ఎస్‌ఐ కార్తీక్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుల్స్ సిద్దార్థ, సునీతలు పాల్గొన్నారు. విస్కీ, బీర్లను స్వాధీనం చేసుకొని, కేసులు నమోదు చేశారు.

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

» మరికల్ వాసి మృతి

మరికల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణపేట జిల్లా, మరికల్ మండల వాసి, గొర్రెల కాపరి కుర్వ బీర్లపోల రాములు మృతి చెందాడు. అతడితో పాటు, మల్లేశ్ ఆరు నెలల క్రితం గొర్రెల మందలతో కామారెడ్డి జిల్లాకు వెళ్లారు. బుధవారం సాయంత్రం మండలంలోని దేవనపల్లి సమీపంలో మందతో రోడ్డు దాటుతుండగా, గుర్తుతెలియని లారీ ఢీకొన్నది. ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. 26 గొర్రెలు కూడా చనిపోయాయి. పోలీసుల నుంచి సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు.

ఇసుక ట్రాక్టర్, మొరం టిప్పర్లు పట్టివేత

కోస్గి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం తెల్లవారుజామున అనుమతి లేకుండా వస్తున్న రెండు మట్టి టిప్పర్లు, ఓ ఇసుక ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్లు వంశీ, శ్రావన్‌తో పాటు, ట్రాక్టర్ డ్రైవర్ మధురెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్దూర్‌లో రెండు ఇసుక టిప్పర్లు..

మద్దూర్ (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనుమతులు లేకుండా మధ్యరాత్రి కోయిలకొం డ వాగు నుంచి ఇసుక నింపుకొని వస్తున్న రెండు టిప్పర్లను కోస్గి రోడ్డులో బుధవారం రాత్రి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుకను తరలి స్తున్న కోయిలకొండ మండలానికి చెందిన పాశం బుచ్చన్న, హన్వాడ మం డలానికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి కర్ణాటక వాసికి తీవ్ర గాయాలు

కృష్ణ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కల్లు తాగి రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని కృష్ణ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీస్ మునిస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మణ విద్యాశాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాయచూర్ నుంచి రైలు ద్వారా కృష్ణ రైల్వేస్టేషన్ పక్కన ఉన్న కల్లు దుకాణంలో కల్లు తాగి తిరిగి రైల్వేస్టేషన్ నుంచి నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు కదులుతుండగా ఎక్కబోయి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో రైలు కదిలి రెండు కాళ్లు తెగి స్పృహ కోల్పోయాడు. అక్కడే ఉన్న స్టేషన్ మేనేజర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. రైల్వే పోలీస్ కానిస్టేబుల్ మునిస్వామి అంబులెన్స్‌కు సమాచారం అందించి అంబులెన్స్‌లో రాయచూర్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ చికిత్స పొందుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నాప్‌కిన్ల తయారీతో స్వయం ఉపాధి

» ఐటీడీఏ ఆధ్వర్యంలో తయారీ కేంద్రం ఏర్పాటు
» గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా
» లబ్ధి పొందుతున్న చెంచు మహిళలు


మన్ననూరులో నాప్‌కిన్‌ల తయారీ యంత్రాలు

మన్ననూర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : నాప్‌కిన్ల తయారీతో నల్లమల ప్రాంత చెంచు మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మన్ననూరులో చెంచు సమాఖ్య కార్యాలయం ఆవరణలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని యంత్రాలు సాంకేతిక లోపంతో మూలన పడ్డాయి. దీంతో అధికారులు స్పందించి, రూ.26 లక్షల వ్యయంతో కొత్త యంత్రాలను అమర్చారు. నాప్‌కిన్ల తయారీకి పలాస్ కంపెనీ వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ముగ్గురు స్థానిక చెంచు మహిళలకు భద్రాచాలం ఐటీడీఏ పరిధిలో కొనసాగుతున్న నాప్‌కిన్ తయారీ కేంద్రంలో యంత్రాల వినియోగం, నాప్‌కిన్ల తయారీపై శిక్షణ ఇప్పించారు.

వాటి తయారీకి అవసరమైన ముడి సరకులను పలాస్ కంపెనీ వారే సరఫరా చేస్తు న్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో సరఫరా

నాగర్‌కర్నూలు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన వసతి గృహాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ద్వారా నిత్యావసర సరుకులు, కాస్మొటిక్స్ సరఫరా చేస్తున్నారు. వాటితో పాటు చెంచు మహిళలు తయారు చేసి నాప్‌కిన్లను కూడా సరఫరా చేసేందుకు ఐటీడీఏ ఏర్పాటు చేసింది. మన్ననూరులోని జీసీసీ మార్కెటింగ్ సొసైటీ వారు నాప్‌కిన్లను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. ఈ ప్రక్రియ విజయవంతం అయితే బహిరంగ మార్కెట్లోనూ వీటిని విక్రయించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ఉపాధి పొందుతున్నాం



ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో నాప్‌కిన్లు తయారు చేసి ఉపాధి పొందుతున్నాం. నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే మాకు స్థానికంగా పని దొరకడం సంతోషంగా ఉంది. వచ్చే ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాం.

\- నిమ్మల అలివేల, అప్పాపూర్

రోజూ 500 నాప్‌కిన్ల తయారీ



మన్ననూరు కేంద్రంలో రోజూ 500కు పైగా నాప్‌కిన్లను త యారు చేస్తున్నాం. ప్ర స్తుతం ముగ్గురు మహి ళలం పని చేస్తున్నాం. బహిరంగ మార్కెట్‌లో డిమాండుకు తగినన్ని నాప్‌కిన్లను తయారు చేసేందుకు సిద్ధం అవుతున్నాం. విక్రయాలు పెరిగితే కేంద్రం అభివృద్ధి చెందడంతో పాటు, మరి కొందరు మహిళలకు ఉపాధి లభిస్తుంది.

\- కాట్రాజు పద్మ, మాచారం

యువకుడు అదృశ్యం


మందడి కార్తీక్‌రెడ్డి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు అదృశ్యం అయ్యాడు. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పట్టణంలోని పుల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్న మందడి రజిత కుమారుడు కార్తీక్‌రెడ్డి, జూలై 4న వీపనగండ్ల మండలం గోవర్ధనగిరికి చెందిన యువతి శైలజను వివాహం చేసుకొని ఇంటికి తీసుకొచ్చాడు.

మరుసటి రోజు వనపర్తిలో కాపురం పెట్టుకుంటామని ఇద్దరు కలిసి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఐదు రోజులకు వీపనగండ్ల పోలీస్‌స్టేషన్ నుంచి కార్తీక్ కుటుంబ సభ్యులకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. మీ కుమారుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అమరావతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, వచ్చి తీసుకెళ్లండని సమాచారం ఇచ్చారు. దీంతో కార్తీక్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమరావతి వెళ్లి చూడగా కన్పించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది.

దీంతో గురువారం నాగర్‌కర్నూల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శైలజ మాత్రం స్వగ్రామంలోని తల్లిదండ్రుల వద్ద ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర పశువుల దొంగల అరెస్టు

» పట్టుకున్న నవాబ్‌పేట పోలీసులకు రివార్డులు
» మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ జానకి

నవాబ్‌పేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్యాటరింగ్ పనిలో వచ్చే డబ్బుతో సంతృప్తి చెందని వారు పశువుల దొంగలుగా మారారు. పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. సంఘటనకు సంబంధించిన వివరాలను మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ గురువారం నవాబ్‌పేట పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మహ్మదాబాద్ మండలం జూలపల్లికి చెందిన కుమ్మరి అశోక్, నల్గొండ జిల్లా నూతకల్ మండలం ముకుందాపూర్ గ్రామానికి చెందిన తాటిపల్లి సాయికుమార్, కరీంనగర్ జిల్లా, సైదాపూర్ మండలంలోని బొబ్బకల్ గ్రామానికి చెందిన సర్దస్ అఖీల్, వరంగల్ జిల్లా, జనగాం మండలంలోని పాకాల గ్రామానికి చెందిన బుర్క సాయి క్యాటరింగ్ పని చేస్తూ జీవనం గడిపేవారు. ఈ పనిలో వచ్చే డబ్బు వారికి సంతృప్తిని ఇవ్వకపోవడం, అధికంగా సంపాదించాలన్న ఆలోచనతో పశువుల దొంగతనాలు మొదలు పెట్టారు. యాదగిరి గుట్ట, యాలాల్, సైబరాబాద్, వికారాబాద్, కుల్కచెర్ల, నవాబ్‌పేట తదితర పాంతాల్లో వ్యాన్‌లో తిరుగుతూ, 16 పశువులను ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా, చౌడాపూర్ మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన అంబటి రాములు తన పశువులు పోయాయని సెప్టెంబరు 2న నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ విక్రం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా గురువారం ఉదయం కన్మన్‌కాల్వ శివారులో తనిఖీలు చేస్తున్న పోలీసులకు పశువులతో వెళ్తున్న వ్యాన్ కనిపించింది. దాని ఆపి, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. తాము 9 పశువులు, 6 లేగ దూడలు, ఒక గేదెను అపహరించినట్లు వారు అంగీకరించారు. వారు దొంగిలించిన పశువుల విలువ 14.50 లక్షలు ఉంటుందని తెలిపారు. దీంతో నలుగురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 9 రోజుల్లో కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని అభినందించి, రివార్డులు అందించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్, నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రం, సిబ్బంది జనార్దన్, వెంకట్రాములు, సురేశ్‌బాబు, భాస్కర్, శెట్టినాయక్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

» కొట్టి చంపారని తండ్రి ఫిర్యాదు


వెంకటేశ్ (ఫైల్)

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలిక అదృశ్యం కావడానికి కారణమని ఆరోపిస్తూ ఆమె బంధువులు యువకుడిని తీసుకెళ్లి కొట్టి బెదిరించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన అతడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మాచన్‌పల్లికి చెందిన వెంకటేశ్(23) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి అదే గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. అందుకు వెంకటేశ్ కారణమని అని భావించిన బాలిక బంధువులు అదే రోజు రాత్రి వెంకటేశ్‌ను ఇంటి నుంచి ఆటోలో గ్రామ శివారుకు తీసుకెళ్లారు. బాలికను ఎక్కడికి తీసుకెళ్లావంటూ కొట్టి బెదిరించారు. ఆమెకు ఏమైనా జరిగితే నీ సంగతి చూస్తామని బెదిరించి, అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత వెంకటేశ్ ఇంటికి రాలేదు. బాలిక మాత్రం అదే రోజు ఇంటికి చేరుకున్నది. మరుసటి రోజు వెంకటేశ్ గ్రామశివారులోని పొలంలో చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడిని కొట్టి చంపి, ఉరి వేశారని అతడి తండ్రి పెంటయ్య గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులు ఎర్రగుంట మహేశ్, ఎర్రగుంట రఘు, పెద్దనెత్తి రవి, కడియం రాములపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

14న జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొననున్న జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 14న ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపిక పోటీలను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2009, నవంబరు 31 తరువాత పుట్టిన వారు, 55 కిలోల బరువు వున్న వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 14న మధ్యాహ్నం 2 గంటలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కాపీలతో రిపోర్టు చేయాలని సూచించారు. ఎంపికైన వారు నిజామా బాద్ జిల్లా ముక్‌పాల్‌లో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నీలో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

పాలమూరు క్రీడాకారుల ప్రతిభ

» జాతీయ స్థాయి షటిల్ టోర్నీకి ఎంపిక


ఆలిండియా సివిల్ సర్వీసెస్ షటిల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌కు చెందిన క్రీడాకారులు సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి టోర్నీకి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో కె. భానుప్రకాష్, వెంకటప్ప, బాలరాజు, సుభాష్ ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఢిల్లీలో త్వరలో నిర్వహించనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ షటిల్‌బ్యాడ్మింటన్ టోర్నీలో వారు పాల్గొననున్నారు. వారిని డీవైఎస్‌వో శ్రీనివాస్ అభినందించారు.

తెరచుకున్న సరళాసాగర్ సైఫన్లు


సరళాసాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

మదనాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టు సైఫన్లు రెండు గురువారం తెరుచుకున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ నుంచి ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 22 ఫీట్లకు నీరు చేరడంతో సైఫన్లు తెరుచుకొని నీరు విడుదల అవుతోంది. చుట్టు పక్కల గ్రామాల రైతులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోహన్ సూచించారు.

దంచికొట్టిన వాన

» గట్టులో 87.5, కేటీదొడ్డిలో 70.5 మిల్లీ మీటర్ల వర్షపాతం
» వనపర్తి జిల్లాలోనూ భారీ వర్షం
» మర్రికుంటలో ఇళ్లలోకి చేరిన నీరు
» ఇబ్బంది పడిన ప్రజలు

వనపర్తి/ ఉప్పునుంతల/ రాజోలి/ అయిజ/ గట్టు/ మహబూబ్‌నగర్/ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలో వాన దంచి కొట్టింది. వనపర్తి జిల్లాలో బుధవారం రాత్రి నుంచే వర్షం మొదలయ్యింది. గురువారం ఉదయం ఏకధాటిగా వర్షం పడడంతో పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణ సమీపంలోని మర్రికుంట లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరుకున్నది. పక్కనే ఉన్న కుంట అలుగు పారడంతో సూర్యచంద్ర హైస్కూల్‌కు వెళ్లే రహదారిపై లోలెవెల్ వంతెన మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వనపర్తి నుంచి పెబ్బేరు వైపు వెళ్లే వాహనదారులతో పాటు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పందించారు. అదనపు కలెక్టర్ యాదయ్య, మునిసిపల్ కమిషనర్, సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపించారు. వరద నీరు సాఫీగా పారేలా ఎక్స్‌కవేటర్ సాయంతో చర్యలు తీసుకున్నారు. గురువారం పొద్దస్తమానం వర్షం కురుస్తూనే ఉండటంతో జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు కూడా తెరుచుకోలేదు. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వనపర్తిలో 50.6, ఆత్మకూరు 38.6, పెద్దమందడి 37.2, మదనాపూర్ 36.2, అమరచింత 31.6, ఘణపూర్ 31.2, కొత్తకోట 24.2, పెబ్బేర్ 23.4, శ్రీరంగాపూర్ 10.6, గోపాల్‌పేటలో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

పాఠశాల తరగతి గదుల్లోకి వర్షపునీరు

నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని తిరుమలాపూర్‌లో భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లో ఫీటు మేర వర్షపు నీరు చేరింది. దీంతో ఉపాధ్యాయులు నిర్మాణంలో ఉన్న అదనపు గదిలో విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెప్పారు. పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం చేశారు. వర్షం వచ్చినప్పుడల్లా తరగతి గదుల్లో వర్షపు నీరు చేరుతోందని ప్రధానోపాధ్యాయుడు అమీర్ తెలిపారు.

● జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, మాచర్ల దళితగేరి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరింది. దీంతో విద్యాబోధన కొనసాగలేదు. వర్షం వచ్చినప్పుడల్లా ఇదే సమస్య తలెత్తుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.


భారీ వర్షంతో వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన అంబేద్కర్ చౌరస్తా


వర్షానికి తడుచుకుంటూ వెళ్తున్న కళాశాల విద్యార్థులు

లోతట్టు ప్రాంతాలు జలమయం

జోగులాంబ గద్వాల జిల్లా, అయిజలో బుధవారం రాత్రి, గురువారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మడ్డిగుంత, తెలుగుపేట, దుర్గానగర్, గాజులపేట వీధుల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు నిలిచి చెరువును తలపించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు, ఉపాధ్యాయులు నాగరాజులు పాఠశాల ఆవరణలో నిల్వ నీటిని మోటార్లతో బయటకు పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని గట్టులో 87.5 మిల్లీమీటర్ల వర్షం కురవగా, కేటీదొడ్డిలో 70.5, రాజోలిలలో 62.8, అయిజలో 52.5, వడ్డేపల్లిలో 46.9, మానవపాడులో 32.1, అలంపూర్‌లో 22.9, మల్దకల్‌లో 21.7, ఇటిక్యాలలో 17.7, ఉండవెల్లిలో 14.2లో మి.మీ. వర్షపాతం నమోదయ్యింది.

● మహబూబ్‌నగర్ పట్టణంలో గురువారం మధ్యాహ్నం తర్వాత వాతావరణం మారిపోయింది. రాత్రి పొద్దుపోయే వరకు ముసురు వర్షం కురిసింది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. రహదారులన్నీ చిత్తడిగా మారాయి. జిల్లా వ్యాప్తంగా 4 మిలీమీట్లర వర్షపాతం నమోదయ్యింది.

● నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో 35.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మాగనూర్ మండలంలో 31.1, ధన్వాడ 23.9, కృష్ణ 21.7, మక్తల్ మండలంలో 17.1, ఊట్కూర్ 12.2, నారాయణపేట మండలంలో 10.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● వనపర్తి జిల్లా కేంద్రంలో అత్యధికంగా 50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది.

● నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో 64.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. బిజినేపల్లిలో మండలంలో 51.8, తాడూరులో 32.4, ఉప్పునుంతలలో 17.4, చారకొండలో 14.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

చేనేత మగ్గం గుంతల్లో ఊటనీరు

జోగులాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన కొత్త రాజోలి చేనేత కాలనీలో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిలవడంతో వారి ఇళ్లలోని మగ్గం గుంతల్లో ఊట నీరు ఉబికి వస్తోంది. ఈ నీరు పోయేందుకు వారం రోజులు పడుతుందని, అప్పటి వరకు నేత పని చేయలేమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.


రాజోలి పట్టణంలోని చేనేత కాలనీలోని మగ్గం గుంతల్లో చేరిన ఊట నీరు

బావాజిపల్లిలో వరుస దొంగతనాలు

» బంగారు వెండి ఆభరణాలు నగదు చోరీ

తిమ్మాజిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల పరిధిలోని బావాజిపల్లిలో గురువారం తెల్లవారుజామున పలు ఇళ్లలో దొంగలు పడ్డారు. బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీ అయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనికె మౌనిక, తన చిన్న కుమారుడు ఇంట్లో, భర్త, అత్తమామలు ఆరుబయట నిద్రిస్తున్నారు. తెల్లవారుజామున పక్క ఇంటి వ్యక్తి కటికె నర్సోజీ దొంగలు దొంగలు అంటూ కేకలు వేయడంతో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. నర్సోజీ తన ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ. 30,500 చోరీకి గురైనట్లు గుర్తించాడు. మౌనిక ఇంట్లో 14 తులాల వెండి గొలుసులు, అర తులం బంగారు కమ్మలు, కొంత నగదు ఎత్తుకెళ్లారు. బాధతుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాలను పరిశీలించి, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

డీవైఎస్‌వో శ్రీనివాస్ బదిలీ

» నేడు విధుల్లో చేరనున్న ప్రశాంత్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాశాఖాధికారి శ్రీనివాస్ బదిలీయ్యారు. 2019 డిసెంబరు 11న విధుల్లో చేరిన శ్రీనివాస్ దాదాపు ఐదేళ్ల పాటు డీవైఎస్‌వోగా విధులు నిర్వహించారు. డీడీగా పదోన్నతి పొందినట్లు సమాచారం. బాస్కెట్‌బాల్ కోచ్ ప్రశాంత్‌ను డీవైఎస్‌వోగా నియమిస్తూ రాష్ట్ర క్రీడాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా, శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

అటవీ అమర వీరులకు నివాళి

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అటవీ అమర వీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరులకు గురువారం జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళి అర్పించారు. వృక్షశాస్త్రం విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 సంయుక్తగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, వృక్షశాస్త్ర విభాగాధిపతులు డాక్టర్ నర్మద, డాక్టర్ సదాశివయ్య మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు.

రుణాలు చెల్లించాలి

కోయిలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఐకేపీ ఏపీఎం వనజ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల మహిళా సంఘం సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. తీసుకొన్న రుణాలు సమయానికి చెల్లిస్తే మరలా రుణాలు త్వరగా అందుతాయని తెలిపారు. సీసీలు మల్లేష్, కేశవులు, భద్రునాయక్, నరేష్, కవిత పాల్గొన్నారు.

వైద్యాధికారుల పర్యటన

నవాబ్‌పేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నవాబ్‌పేటలో గురువారం వైద్యాధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా 75 కుటుంబాలతో మాట్లాడి ఇంటింటి జర సర్వే నిర్వహించారు. వైద్యాధికారి శ్రావన్‌కుమార్, అశోక్‌రాజు, రాములు, బాలమ్మ, శరభలింగం, జానకిరాములు, నిర్మల, మాధవి, సరోజ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలి

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌వీ పీయూ కన్వీనర్ భారత్‌బాబు డిమాండ్ చేశారు. పీయూ ప్రధాన గేటు వద్ద గురువారం నిరసన చేపట్టారు. పీయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గ్రూప్ 1 పరీక్షను రద్దు చేయాలని కోర్టు తీర్పు మేరకు ప్రభుత్వం నడుచుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోయిలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగనోనిపల్లి సబ్‌స్టేషన్ ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ పనులు కారణంగా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మద్దిలేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వింజమూరు, అంకిళ్ల గ్రామాల్లో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ఏరియా ఆసుపత్రి వద్ద వాటర్ ట్యాంకు నిర్మాణానికి గురువారం మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్మోహన్‌రావు పరిశీలించారు. రూ.19 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు. మిషన్‌భగీరథ ఈఈ శ్రీనివాసులు, ఏఈ మొగులాల్, కౌన్సిలర్ సతీష్, మునిసిపల్ ఫిట్టర్ యాదయ్య ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు పొడిగింపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 ఏడాదికి సంబంధించి డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు శుక్రవారం వరకు గడువు పొడిగించినట్లు ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా 12వ తేదీలోగా ఆన్‌లైన్ ఫీజు చెల్లించాలని సూచించారు.

ఘనంగా జాతీయ హిందీ దినోత్సవం

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాషకు ప్రతిష్ఠ పెరుగుతోందని ఎంఈవో మంజులాదేవి అన్నారు. మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం జాతీయ హిందీ దినోత్సవాన్ని నిర్వహించగా, ఎంఈవో పాల్గొని, మాట్లాడారు. అనంతరం హిందీ ప్రాముఖ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు అవగాహన

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఫుట్‌బాల్ క్రీడపై అవగహన కల్పించారు. అంతర్జాతీయ హిప్నో కోచ్ నిజాం తోండూరు క్రీడాకారులు మ్యాచ్ పట్ల తీసుకోవల్సిన సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి నాగేశ్వర్, సభ్యులు నందకిశోర్, రామకృష్ణ, మోయిన్, ఖేలో ఇండియా కోచ్ నికేష్ పాల్గొన్నారు.

కోర్టు భవనం శంకుస్థాపనకు..

సీఎంను ఆహ్వానిస్తా

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి » కోర్టు ఆవరణలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కోర్టు ఆవరణలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో అన్ని హంగులతో రూ.81 కోట్లతో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ కోర్టు భవన నిర్మాణ భూమిపూజకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇంటిగ్రేటెడ్ కోర్టు భవన నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో రూ.35 లక్షల ముడా నిధులతో చేపట్టే పార్కింగ్ షెడ్ పనులకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. విజన్ 2047 లక్ష్యంగా పనిచేస్తున్నామని, వచ్చే 20 ఏళ్లలో నగరంలో కావల్సిన అన్ని మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. కోర్టు ఆవరణలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కంప్యూటర్లతో పాటు రీడింగ్ రూమ్ ఏర్పాటు చేస్తానన్నారు. సీనియర్ న్యాయవాది ప్రతాప్‌కుమార్ విద్యానిధికి రూ.5 లక్షలు విరాళం ఇస్తానని, ఈ డబ్బును కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసే డిజిటల్ లైబ్రరీ కోసం వినియోగించాలని కోరారు. అనంతరం జిల్లా న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. అంతకుముందు ముడా నిధులతో వీరన్నపేటలోని నీలకంఠస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.15 లక్షలతో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, గోపాల్‌యాదవ్, శాంతన్నయాదవ్, రాములు, మల్లేశ్, రఘు, రాకేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనంతరెడ్డి, శ్రీధర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కుర్మయ్య, ఇలియాస్, స్వదేశ్, కృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

న్యాయవాదికి సన్మానం

విద్యానిధికి రూ.5 లక్షలు విరాళం ఇచ్చిన సీనియర్ న్యాయవాది ప్రతాప్‌కుమార్‌ను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. జిల్లా కోర్టులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి న్యాయవాది ప్రతాప్‌కుమార్ విద్యానిధికి రూ.5 లక్షలు విరాళం ఇస్తానని, ఆ నిధిని కోర్టు ప్రాంగణంలో చేపట్టనున్న డిజిటల్ లైబ్రరీకి వినియోగించాలని కోరడం అభినందనీయమన్నారు. న్యాయ వాదులు స్వదేశ్, రాంనాథ్‌గౌడ్, రవికుమార్, శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు హరినాథ్ ఉన్నారు.

పీపీఈ కిట్లు పంపిణీ

నగరంలోని మినీ శిల్పారామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరపాలక సంస్థలో పని చేస్తున్న 400 మంది పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి పీపీఈ కిట్లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యబీమా గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. నగరం పరిశుభ్రంగా ఉంచాలంటే పారిశుధ్య కార్మికులదే బాధ్యత అని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జీపీవోలుగా వెళ్తున్న ఉద్యోగులకు వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న వార్డు అధికారులను సన్మానిస్తున్న కమిషనర్, అధికారులు

జడ్చర్ల/భూత్పూర్ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామపరిపాలన అధికారులుగా వెళ్తున్న ఉద్యోగులకు గురువారం జడ్చర్ల మునిసిపాలిటీలో ఘనంగా వీడ్కోలు పలికారు. మునిసిపాలిటీలో వార్డు అధికారులుగా పనిచేస్తున్న నర్సిములు, కృష్ణయ్య, రాంమోహన్‌రావు, శివకుమార్‌లు గ్రామీణ వ్యవస్థలో భాగంగా పునరుద్ధరించిన గ్రామపరిపాలనా అధికారులుగా నియమించబడ్డారు. వీరికి మునిసిపల్ కార్యాలయంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్‌లు ప్రశాంత్‌రెడ్డి, కుమ్మరి రాజు పాల్గొన్నారు. భూత్పూర్ మునిసాపాలిటీలో వార్డు అధికారులుగా పని చేస్తున్న వెంకట్ రెడ్డి, రమేష్, అంజనేయులు గోపాల్, సైదమ్మ, కుర్మయ్య, కేశవులు, చంద్రశేఖర్, బుచ్చమ్మ, పార్వతమ్మ జీపీవోలుగా బదిలీపై వెళ్తుండగా మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఘనంగా సన్మానించారు.

జీపీవోలు ఆదర్శంగా నిలవాలి..

నవాబ్‌పేట : నూతనంగా నియమితులైన జీపీవోలు ఇతరులకు ఆదర్శంగా ఉండాలని అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఫిర్యాదులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ, నూతనంగా నియమితులైన జీపీవోలను అభినందించారు.

సేవా పక్షోత్సవాలు నిర్వహించాలి

» బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మజారెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే సేవా పక్షోత్సవాలు బూత్ స్థాయిలో నిర్వహించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి పిలునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కన్వీనర్ కొత్తకోట కిరణ్ కుమార్‌రెడ్డి అధ్యతన జరిగిన కార్యవర్గ సమావేశానికి ఆమె పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినం, ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సేవ పక్షం జిల్లా కో కన్వీనర్ రాజుగౌడ, మల్లేష్, సాయితిరెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, గంగన్న, లక్ష్మి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన హన్వాడకు చెందిన కాంగ్రెస్ నాయకులు దాసరి పెంటయ్య, మాజీ ఉప సర్పంచ్ గంగాపూరి, వెంకటయ్య, గోవర్ధన్ గౌడ్, చెన్నయ్య, లక్ష్మయ్య గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు వ్యతిరేకత పెరుగుతుందన్నారు. రైతులకు యూరియా అందించడంలో విఫలమైందని మండిపడ్డారు. మండల నాయకులు కొండ లక్ష్మయ్య, బాలరాజు, శ్రీనువాసులు, నాగన్న, జంబులయ్య, యాదయ్య, మాధవులుగౌడ్, రాములు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో మొట్టమొదటి ఓపెన్ హార్ట్ సర్జరీ



సర్జరీ చేయించుకున్న రోగితో డాక్టర్ల బృందం

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఆరోగ్యశ్రీ పథకంలో మొట్టమొదటి ఓపెన్ హార్ట్ సర్జరీ సుశ్రుత ప్రజా వైద్యశాలలో జరిగింది. ఈ సందర్భంగా గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. దేవరకద్ర మండలం గోపన్‌పల్లికి చెందిన 40 ఏళ్ల ఉప్పరి బొంబాయి లక్ష్మికి గతేడాది కాలంగా గుండె వ్యాధికి సంబంధించిన లక్షణాలతో బాధపడుతుందని, 6 నెలల క్రితం తమ ఆసుపత్రికి వచ్చిందన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి గుండెలోని కుడి కవాటాలు మూసుకుపోవడంతో పాటు అక్కడే రక్తం గడ్డకట్టడంతో రెండు నెలలు వైద్యచికిత్సలు చేసి రక్తం పలచబడేలా చేశామన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని సెంచరీ ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకొని ఆమెకు గుండె కవాటం మార్పిడి (మైటెల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్) (ఓపెన్ హార్ట్) శస్త్ర చికిత్స మూడున్నర గంటల పాటు కష్టపడి విజయవంతం చేశారని పేర్కొన్నారు. ప్రతీ గురువారం సెంచరీ ఆసుపత్రి గుండె డాక్టర్లతో ఓపీ సేవలు కూడా అందిస్తున్నామన్నారు. ఈ సర్జరీలో సెంచరీ ఆసుపత్రి వైద్య బృందం కార్డియో సర్జరీ డాక్టర్లు హేమంత్, ప్రవీన్, అనేస్థిషియా డాక్టర్ శ్రీధర్ ఉన్నారు. సమావేశంలో ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిభ, గుండె వైద్య నిపుణులు భరత్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

వర్షాలతో జాగ్రత్త : ఎస్పీ

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వచ్చే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి గురువారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. ఇప్పటికే చెరువులు, కుంటలు నిండు కుండలా ఉన్నందున వర్షాలు కురిస్తే అలుగులు పారే అవకాశం ఉందని, అటుగా వెళ్లవద్దని కోరారు. ఎలాంటి సమస్య ఉన్నా డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రాజాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన చింతల నాగమ్మ, మండల కేంద్రానికి చెందిన బోయ చంద్రయ్య ఇరువురు అనారోగ్యంతో మృతి చెందారు. వారి అంత్యక్రియలకు దొండ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు చించోడ్ అభిమన్యురెడ్డి ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున సమకూర్చుగా అభిమన్యు యువసేన సభ్యులు గురువారం అందజేశారు.

పోస్టర్ విడుదల

కోయిలకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో గ్రాఫర్‌ల పండుగ ఎక్స్ ఫో పోస్టర్‌ను గురువారం తహసీల్దార్ రాజా గణేష్ విడుదల చేసి, మాట్లాడారు. ఫొటో గ్రాఫర్ల సంఘం నాయకులు శేఖర్, రమేష్, పరందాములుగౌడ్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ రీజియన్ ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (రీజినల్ సెక్రటరీ) ధార సుందర్ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఎం సంతోష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రోస్టర్ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని, బదిలీలు చేపట్టాలని, సస్పెండ్ అయిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు భాగ్య, చిన్నికృష్ణ, భాస్కర్, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

రాజాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అంబేడ్కర్ కళాభవన్‌ను మంజూరు చేయాలని అంబేడ్కర్ సంఘం మండల నాయకులు గురువారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య, రాఘవేందర్, జగ్గయ్య, శేఖర్, కృష్ణయ్య, ఇస్తారయ్య, సాయి, నర్సింహులు, బుగ్గయ్య, రవి, బాలరాజ్, కృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మూసాపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన కటిక రసూల్‌బీ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీజేపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు రమేష్ పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ నాయకులు మల్లేష్, జానయ్య గౌడ్, బుచ్చయ్య, అహ్మద్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మూసాపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన మునగాల యోసేప్ గుండె సంబంధిత శస్త్ర చికిత్స కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. గురువారం ఎమ్మెల్యే జీఎంఆర్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు విజయమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, నాయకులు వేగనాథ్, రాములు, బుచ్చన్న పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

మూసాపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. గురువారం మండలంలోని పోల్కంపల్లి ఆశ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సేవా సంస్థ నిర్వాహకులు ప్రవీన్, బాసీత్, కార్యదర్శి నరేందర్, బషీర్, అంజాద్, సురేందర్, కురుమూర్తి ఉన్నారు.

యాత్రా దానం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్ఎం సంతోష్‌కుమార్, అధికారులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాత్రా దానం చేయడానికి దాతలు ముందుకొచ్చి యాత్ర ఖర్చులు భరిస్తే బస్సులను ఏర్పాటు చేస్తామని ఆర్ఎం సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆర్ఎం పోస్టర్ విడుదల చేసి, మాట్లాడారు. ఆర్టీసీలో ఇటీవల ప్రవేశపెట్టిన అనేక టూర్ ప్యాకేజీలు విజయవంతం అయ్యామని, అందులో భాగంగా దాతల కోసం ప్రత్యేకంగా యాత్రా దానం అనే సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పుట్టిన రోజులు, వివాహ మహోత్సవాలు తదితర సందర్భాల్లో పేద విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు, పుణ్యం కోసం భక్తులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు సంస్థల ద్వారా బస్సులను బుక్ చేసి తీసుకెళ్లడమే ఈ యాత్రా దానం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పథకం నిర్వాహణ కోసం సంస్థ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసిందని, ఇందులో ముందుగా రవాణా శాఖ మంత్రి, సంస్థ ఎండీ రూ.లక్ష డిపాజిట్ చేశారని, ఇలాంటి సరికొత్త పథకం దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టామని ఆర్ఎం అన్నారు. దాతలు ముందుకొచ్చి ఆయా సమీప డిపో మేనేజర్లను కలిస్తే వివరాలు తెలుపుతారని ఆర్ఎం పేర్కొన్నారు. డిప్యూటీ ఆర్ఎంలు లక్ష్మీధర్మ, కవిత, డీఎం సుజాత, పీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళిత, ముస్లింల మధ్య చిచ్చు పెట్టొద్దు



సమావేశంలో పాల్గొన్న దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు

పాలమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దళిత, ముస్లింల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న నాయకుడిని కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగించాలని అంబేడ్కర్ కళా భవనం పరిరక్షణ కమిటీ (జేఏసీ) ఉమ్మడి జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన దళిత, బహుజన సంఘాల ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. అంబేడ్కర్ కళా భవనం రక్షించాలని, అక్కడ ఉర్దూఘర్ నిర్మించరాదన్నారు. దళిత, బహుజన కులాల పక్షాన ముఖ్యమంత్రి బాధ్యత తీసుకోకుంటే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు పరమేశ్వర్, రాందాసు, రమేష్, గోపాలకృష్ణ, రాయుడు, భగవంతుడు, సాయిలు, నరసింహ, వాల్మీకి, రమేష్, నరేందర్, అశోక్, లక్ష్మీకాంత్, కొండన్న, యాదగిరి, తిరుమలయ్య, శ్రీవల్లి, నాగయ్య, కృష్ణయ్య, చిన్నప్ప, భీమన్న, గోపాల్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుకన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్ బోధించుటకు ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు. పీహెచ్‌డీ నెట్ సెట్ సంబంధిత పీజీ సబ్జెక్ట్‌లలో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, ఈనెల 15న కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 26 ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయనుండగా, ఇందుకు సంబంధించి ఎంపికైన పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి డీఈవో ప్రవీణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తాత్కాలిక పద్ధతిలో ఉంటాయని, ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్మీడియట్, ఆయాకు ఏడో తరగతి చదివి ఉండాలని, అదే గ్రామానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో లేకుంటే సమీప గ్రామానికి చెందిన మహిళ అభ్యర్థులు, 18 నుంచి 44 ఏళ్ల వయస్సు గల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8వేలు, ఆయాకు రూ.6 వేల నెలసరి వేతనం అందించనున్నట్లు డీఈవో తెలిపారు.

లెఫ్ట్ ఓవర్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి



పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో నిర్వహించిన పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులు వివిధ కారణాల వల్ల పదోన్నతులకు నాట్ విల్లింగ్ ఇచ్చారు. దీంతో మిగిలిన ఖాళీలకు (లెఫ్ట్ ఓవర్ పోస్టులకు) దసరా సెలువుల్లో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలని గురువారం పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు నవీన్‌కుమార్ నికోలస్‌కు వినితి పత్రం అందజేశారు. పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఎఫ్ఆర్ఎస్ అమలును నిలిపి వేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు, వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్, స్పౌజ్ ఫోరం అధ్యక్షుడు వివేకానంద, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి భూపతిసింగ్ పాల్గొన్నారు

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చిన్నచింతకుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పళ్లమర్రి గ్రామంలో బహదూర్ రామ్‌రెడ్డి మృతి చెందగా ఆయన భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదే గ్రామానికి చెందిన బొంబాయి కురుమన్న కుటుంబ సభ్యులతో పాటు కుమ్మరి అంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను పరామర్శించారు. చిన్న వడ్డెమాన్‌లో సింగిల్‌విండో డైరెక్టర్ కురుమక్క గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆమెను పరామర్శించారు. పెద్ద వడ్డెమాన్ రాఘవ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమాల్లో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోట రాము, మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, రవీందర్ రెడ్డి, రఘువర్ధన్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ కన్వీనర్‌గా మోహన్ ఆచారి

మూసాపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ నాలెడ్జ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్‌గా మూసాపేట మండలం జానంపేట గ్రామానికి చెందిన కె.మోహన్ ఆచారి నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో విశ్వకర్మ బ్రహ్మణ యువజన విభాగం అధ్యక్షుడు మునిగంటి త్రినాథ్ ఆచారి ప్రకటించగా, ఆత్మకూరు పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు డీకే విశ్వప్రకాష్ ఆచారి నియామక పత్రం అందజేశారు.

సాగు విస్తీర్ణం పెరగడంతోనే యూరియా కష్టాలు

పాలమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, కంది, కూరగాయలు వంటి పంటల సాగు పెరగటంతోనే రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారని జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2024 వానాకాలంలో 3,31,498 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయగా, 2025లో 3,64,573 ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ఉద్యాన పంటలు 2024 వానాకాలం సాగుతో పోల్చితే, 2025లో 50 వేల ఎకరాల సాగు పెరిగిందన్నారు. ప్రత్యామ్నాయంగా నానో యూరియాను పిచికారి చేసి మంచి దిగుబడులు పొందవచ్చని వివరించారు.

క్రీడాభివృద్ధికే నూతన క్రీడాపాలసీ



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వ్యాయామ విద్య ఉపాధ్యాయులు

జడ్చర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి నూతన క్రీడా పాలసీ తీసుకురావడం హర్షణీయమని పీడీ అండ్ పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీ హరిజనవాడ జడ్పీహెచ్ఎస్‌లో గురువారం వ్యాయామ విద్య ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలతో క్రీడలకు మహర్దశ రానుందని, కాలానుగుణంగా మారుతున్న క్రీడా నైపుణ్యాలు, నియమ నిబంధనలు, శిక్షణలో మార్పులు తదితర అంశాలు చర్చించుకోవడానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడుతాయన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కృష్ణయ్య, శారదాబాయి, వడ్డెన్న, కిట్టు, మోయిన్ పాల్గొన్నారు.